క్లుప్తంగా

ప్రజలు సంతోషంగా ఉండాలి



మొక్కులు చెల్లించుకుంటున్న ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: ప్రజలంతా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని పెద్దమ్మ తల్లిని వేడుకున్నట్లు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెక్కపల్లిలో పెద్దమ్మ తల్లి యాత్ర ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజ్ సంఘ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. సంఘ సభ్యులు, గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న వికాస్‌రావు

పెద్దమ్మ ఉత్సవాల్లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.వికాస్‌రావు పాల్గొన్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. బీజేపీ రూరల్ అధ్యక్షుడు జక్కుల తిరుపతి, రాజు, శ్రీధర్‌బాబు, సంతోష్‌రెడ్డి, దానె తిరుపతి, రాజేందర్‌లు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే లక్ష్యం



ముస్లిలంతో కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో ముస్లింలకు పార్టీ ఆధ్వర్యంలో పందిర్ల సుధాకర్‌గౌడ్ గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ..పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు జబ్బర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్లు ట్యాపింగ్ చేయించిన ఘనత కేటీఆర్‌దే



మాట్లాడుతున్న మునిగెల రాజు

తంగళ్లపల్లి: నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి ఎమ్మెల్యేగా గెలిచిన ఘనత బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌దేనని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు ఆరోపించారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. జిల్లెల్లలో 20 గుంటల భూమికి పరిహారం రాకుండా ఆపిందెవరో బీఆర్‌ఎస్ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజక కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, సోషల్ మీడియా జిల్లా కో–ఆర్డినేటర్ గడ్డం మధుకర్(భోటు), మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్ గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, అసెంబ్లీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ అభినయ్ గౌడ్, ఫిషరీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, తిరుపతి, మధు, వినోద్, నరేందర్, వినయ్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసగిస్తున్న కాంగ్రెస్



సిరిసిల్లటౌన్: మాదిగలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి ప్రభాకర్ పేర్కొన్నారు. ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై నిరసన తెలిపి మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక జనాభ గల మాదిగలకు ఒక్క సీటు ఇవ్వలేదన్నారు. ఆరు శాతం ఉన్న రెడ్డిలకు ఆరు సీట్లను కేటాయించిన రేవంత్‌రెడ్డి, 12 శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటును ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఖానాపురం లక్ష్మణ్, ఎలగందుల భిక్షపతి, ఆకారపు రాజు, సావనపెల్లి రాకేశ్, బడుగు సంజీవ్, దయ్యాల నారాయణ, వెంకట్, అర్జున్, దేవరాజు ఉన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎల్లారెడ్డిపేట : మండలకేంద్రానికి చెందిన దర్ర మహేశ్ అనే వ్యక్తిని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు గురువారం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన సదరు వ్యక్తిని పాఠశాల యాజమాన్యం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల బస్సుడ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడుపుతూ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహేశ్‌ను ఢీకొట్టింది. మహేశ్ తల, ముఖానికి గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు.

ఇప్పపువ్వు సేకరణలో గిరిజనులు

- ఏటా వేసవిలో ఇప్పపువ్వు, తునికాకు సేకరణ
- ఒక్కో చెట్టుకు పది నుంచి ఇరవై కిలోలు
- రూ.8వేలనుంచి 10వేల వరకు ఆదాయం



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు బాదావత్ మంగవ్వ. భూక్యా తండా శివారు రాశిగుట్ట తండా చెందిన ఈమె ఉదయమే అడవికి వెళ్లి ఇప్పపువ్వు సేకరిస్తోంది. నెలరోజుల పాటు సేకరించిన వాటిని ఆరబెట్టి విక్రయిస్తోంది. ఈ సీజన్‌లో రూ.8వేల నుంచి పదివేల వరకు ఆదాయం వస్తుంది. వచ్చిన డబ్బుతో ఇంట్లో కావాల్సిన సరుకులు తీసుకువస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.

వీర్నపల్లి: మండలంలో దాదాపు 16 గిరిజన తండాలున్నాయి. ఏటా వేసవిలో గిరిజనులతోపాటు ఇతరులకు అడవితల్లే ఆధారమవుతోంది. అడవిలో ఇప్పపువ్వు, తునికాకు సేకరణతో గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. మండలంలో అన్నిగ్రామాల్లో ఇప్పపువ్వు సీజన్ మొదలైంది. ఏటా మార్చి నుంచి మే చివరివరకు ఇప్పపువ్వు సేకరణలో గిరిజనులు నిమగ్నమవుతారు. తునికాకుతో పాటు ఇప్పపువ్వు కోసం ఉదయ నుంచి రాత్రివరకు చిన్నా, పెద్దా తేడా లేకుండా తట్టా, బుట్ట పట్టుకొని అడవిబాట పడుతుంటారు. గిరిజనులు జరుపుకునే సాంప్రదాయ వేడుకలు, తీజ్ సంబరాలు, వివాహాల సమయాల్లో ఇప్పపువ్వుతో తయారుచేసిన సారాయి తాగడం ఆచారంగా పాటిస్తారు. వానాకాలం వచ్చిందంటే



ఇప్పపువ్వు ఏరుతున్న గిరిజన మహిళ



ఎండలో ఆరబోసిన ఇప్పపువ్వు

చిక్కుడు గింజలు, అల్పందలు కలిపి ఉడికించి అంబలి కాస్తారు. మరికొందరు ఇప్ప ఉండలను అల్పాహారంగా తీసుకుంటారు.

ఇప్పపువ్వు ప్రారంభదశ..

ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు ఇప్పచెట్లు ఆకు రాలుస్తాయి. ఇప్పపువ్వు సాధారణంగా ఉదయం సమయంలోనే రాలుతుంది. ఒక ఇప్పచెట్టు నుంచి సుమారు పది నుంచి 20 కిలోల ఇప్పపువ్వు రాలుతాయి. ఇలా రాలిపడిన పువ్వును సేకరించి ఎండలో ఆరబెడుతారు. బాగా ఎండిన తర్వాత ఒక లావుపాటి కర్రతో పూలలోని పొట్టు పోయేంతవరకు కొట్టి, గాలిదూరని విధంగా సంచుల్లో నింపి నిల్వచేస్తారు. వీటిని తమ అవసరాలకు ఉపయోగిస్తారు.

ఉపగాయోగాలివే..

చాలామందికి ఇప్పపువ్వుతో సారాయి తయారు చేసేందుకు అని తెలుసు. కానీ సారాయి కాకుండా గిరిజనులంతా ఇప్పపువ్వును పెంకుల్లో వేయించి తర్వాత దంచిన వెల్లుల్లి, మిర్చి, అల్లం కలుపుతారు. అన్నీ కలిపి మోదుగాకుల్లో ఉండలుగా చుడుతారు. వాటిని నెయ్యితో కలిపి తింటారు. ఇప్పపువ్వును నిల్వచేసి తినడంతో ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. రక్తహీనతతో బాధపడేవారికి ఇప్పపువ్వు ఉండలు ఎంతో ఉపయోగకరమని గిరిజనులు చెబుతున్నారు. ఇప్పపువ్వు ఉండలు గర్భిణులకు పౌష్టికాహారంగా ఉపయోగపడుతాయి. గొర్ల కాపరులు ఉదయమే గొర్రెలు, మేకలను తీసుకొని అడవిబాట పడుతారు. ఇప్పపువ్వులు గొర్ల, మేకలకే కాకుండా అడవిలో ఉండే మూగజీవాలకు సైతం ఆహారంగా ఉపయోగపడుతోంది.

సొసైటీ ద్వారా కొనుగోలు చేయాలి



గిరిజనులు ఏటా మార్చినుంచి మేలో ఇప్పపువ్వును సేకరిస్తారు. కానీ ఎక్కడ అమ్మాలో తెలియక దళారుల చేతులో మోసపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కామారెడ్డి గిరిజన కార్పొరేషన్ సొసైటీ ద్వారా కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని కోరుతున్నాం.

– భగవంతం, మాజీ వనసంరక్షణ సమితి చైర్మన్, వీర్నపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



మా చేనులోనే నాలుగు ఇప్పచెట్లు ఉన్నాయి ఒక్కో చెట్టు నుంచి ఐదు నుంచి పదికిలోల వరకు ఇప్పపువ్వు రాలుతుంది. ఇప్పటి వరకు క్వింటాల్ వరకు సేకరించా. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇప్పపువ్వు ఏరుతా. కిలోకు రూ.25 నుంచి రూ.30 వరకే ధకర ఉంది. ధరలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– బదావత్ లింబవ్వ, పోచమ్మ తండా

వేసవిలో నీటిఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్

బోయినపల్లి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో జయశీల, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎండలు మండుతున్నందున గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని, అద్దె బావులు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో శ్రీనివాస దీక్షిత్ అమ్మ ఆదర్శ కమిటీల గూర్చి వివరించారు. ఎంఏఓ ప్రణీత పంటల నమోదు గురించి తెలిపారు. ఈజీఎస్ ఏపీవో వనం సబిత మాట్లాడుతూ వేసవిలో కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విలాసాగర్, కొదురుపాక పీహెచ్‌సీల నివేదికలను సూపర్‌వైజర్లు సభలో నివేదించారు. ఎంపీడీవో జయశీల మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను వారానికి మూడుసార్లు క్లోరినేషన్ చేయాలని, ఇందుకు ప్రత్యేకాధికారులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ పైపులైన్ ఉన్న ఇళ్లకు నల్లా కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీటీసీలు సంబ బుచ్చమ్మ, కొంకటి శిరీష, అక్కెనపెల్లి ఉపేందర్, ఉయ్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



రైతుదీక్షలో పాల్గొన్న నాయకులు

బోయినపల్లి: మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రైతుదీక్ష చేపట్టారు, ప్రభుత్వ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉదారి నర్సింహాచారి, క్యాతం తిరుపతిరెడ్డి, కొనుకటి హరీశ్, సుంకపాక ప్రభు, ఎడపల్లి పర్శరామ్, శ్రీనివాస్, రెడ్డవేని రాజు, రాజూరి కిరణ్, సింగరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పేరుతో దొంగ దీక్షలు

సిరిసిల్లటౌన్: ఎంపీ బండి సంజయ్ రైతుల పేరుతో దొంగ దీక్షలు చేయడం శోచనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. గురువారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో పన్నెండు వందల రైతులను చంపి..ఇక్కడ రైతుల సంక్షేమ కోసం అంటూ బండి దీక్షలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులు, కార్మికులు, మహిళా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు చెంపపెట్టులా తీర్పు ఇస్తారన్నారు. నాయకులు లక్ష్మణ్, అజ్జ వేణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

తంగళ్లపల్లి: మండలకేంద్రానికి చెందిన మైనారిటీ నాయకుడు మహ్మద్ హమీద్ నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ జిల్లా అధ్యక్షుడిగా గురువారం నియామకమయ్యారు. హమీద్ మాట్లాడుతూ తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు మహ్మద్ అర్షద్ ఖాన్, నేషనల్ చీఫ్ సెక్రటరీ సయ్యద్ షబ్బీర్ అలి మహ్మద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట : మండలంలోని దుమాలకు చెందిన చేకూటి అనూష్ యాదవ్‌ను బీజేపీ యువమోర్చా జాతీయ కో–ఆర్డినేటర్‌గా నియామకమయ్యారు. రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ ఉత్తర్వులు అందజేశారు.తన నియామాకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

మామూళ్ల కోసం కాల్స్?

- మారిన సీఐ పేరిట హుకూం..
- వైన్స్‌షాపుల నిర్వాహకుల్లో ఆందోళన

సిరిసిల్లక్రైం: ఆర్థిక లావాదేవీల విషయంలో వేటుపడిన వేములవాడ పోలీసు అధికారిలో మార్పు రావడం లేదన్న విమర్శలు ఇప్పటికీ బహిర్గతమవుతున్నాయి. నెలవారీగా మద్యం దుకాణాల నుంచి వచ్చే మాముళ్ల కోసం ఇక్కడ నుంచి ఇటీవలే ఐజీ కార్యాలయానికి అటాచ్‌పై వెళ్లి అధికారి కాల్స్ చేస్తున్నట్లు వైన్స్ నిర్వాహకుల్లో కొందరు మీడియాకు లీకులివ్వడం జిల్లాలో జోరుగా చర్చ జరుగుతుంది. ప్రతినెలా 10 నుంచి 15లోగా రూ.15 వేలు వసూళ్లు జరిగేవని, లేకుంటే వైన్స్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని కొర్రీలు పెట్టేవారని తెలిసింది. అధికారి విధానాలతో విసిగిపోయిన వైన్స్ నిర్వాహకులు చేసేది లేక డబ్బులు చెల్లించినట్లు సమాచారం. అయితే గతనెల 30వరకు అధికారిగా ఉన్న అధికారి ఆనెలకు రావాల్సిన మామూళ్ల కోసం వైన్స్ నిర్వాహకులకు ఫోన్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే డబ్బులు సదరు అధికారికి ఒక్కో వైన్స్ చొప్పున లెక్కిస్తే రూ. 1.5 లక్ష నుంచి రూ.2లక్షలు ప్రతినెలా వస్తున్నట్లు నిర్వాహకుల ద్వారా తెలుస్తుంది. ఇక్కడి నుంచి వెళ్లిన అధికారికి మామూళ్లు తీసుకెళ్లి ఇప్పుడు ఇచ్చేది ఎవరన్నది అందరిలో సందిగ్ధం నెలకొంది. దీనిపై విచారణ జరిగితే చర్యలు ఎలా ఉంటాయోనని పలువురు భావిస్తున్నారు.

చెక్‌డ్యాంల పరిశీలన



బొల్లారం చెక్‌డ్యాం పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: మండలంలోని మూలవాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను వెంటనే ప్రారంభించాలని ఆ శాఖ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం జయవరం, మల్లారం, బొల్లారం గ్రామాల్లో నిర్మిస్తున్న చెక్‌డ్యాంలను పరిశీలించారు. గతంలో నిర్మించిన చెక్‌డ్యాంలు వర్షాకాలంలో దెబ్బతిన్నాయని, వెంటనే మళ్లీ వర్షాకాలంలోపు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్, ఈఈ అమరేందర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

విచారణ జరపాలి

ఎల్లారెడ్డిపేట: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే నిరసనలు తెలిపితే అక్రమ అరెస్టులకు పాల్పడ్డారని బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కొనేటి సాయిలు అన్నారు. గత ప్రభుత్వం పెట్టిన కేసుల విచారణకు గురువారం ఆ పార్టీ నాయకులు సిరిసిల్ల కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు జరిగాయన్నారు. విచారణ జరిపి ఆ పార్టీ నాయకులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గుండాడి వెంకట్‌రెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, పిట్ల శ్రీశైలం తదితరులున్నారు.

చోరీకి యత్నం

కోనరావుపేట: మామిడిపల్లిలో రెండు దుకాణాల్లో చోరీకి యత్నించారు. గ్రామానికి చెందిన మ్యాన లింగమూర్తి హోటల్ నడుపుతూ అనారోగ్యానికి గురై 25 రోజుల క్రితం మృతిచెందాడు. లింగమూర్తి కుమారులు హోటల్ నడుపుతున్నారు. హోటల్ ముందు ఉన్న ఫ్రిజ్ డోర్లను పగులగొట్టారు. లోపల మరో గ్లాస్ ఉండటంతో వస్తువులు అపహరణకు గురికాలేదు. ఇదే గ్రామానికి చెందిన బుర్ర సత్తయ్య కిరాణా దుకాణంలో అర్ధరాత్రి ఓ వ్యక్తి వచ్చి తలుపులు, కౌంటర్‌ను కాలితో తన్ని పరారయ్యాడు. గ్రామానికి వచ్చిన యువకులు మద్యం మత్తులో చేశారా లేక దొంగతనానికి యత్నించారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసీ కెమెరాలో రికార్డయిన పుటేజీని బట్టి చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన వ్యక్తులుగా అనుమానిస్తున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన సిరిపురం ముత్తయ్య గురువారం గడ్డి మందు ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఆటోడ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట: ఆటోలో పరిమితికి మించి స్కూల్ విద్యార్థులు ఎక్కించుకున్న ఎల్లారెడ్డిపేటకు చెందిన మహమ్మద్ అహ్మద్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను, ప్రయాణికులను ఎక్కించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

వీర్నపల్లి: మండలకేంద్రంలో సీఐఎస్ఎఫ్(సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) బలగాలతో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో గురువారం ప్రధాన రహదారి వాహనాల తనిఖీలు చేశారు. సీఐఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

'టెట్' ఫీజు తగ్గించాలి

ఎల్లారెడ్డిపేట: టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు కొర్రి అనిల్ డిమాండ్ చేశారు, మండల కేంద్రంలో మాట్లాడారు. గత ప్రభుత్వం టెట్ 2 పరీక్షలకు గాను రూ.400 వసూలు చేయగా కాంగ్రెస్ పార్టీ ఒకే పేపర్కు రూ.1000 వసూలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఆలోచించి టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు.

'ప్రజలను మభ్యపెడితే ఊరుకోం'

తంగళ్లపలి: రైతుల గురించి మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్, బీజేపీకి లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ముందుగా రైతాంగానికి క్షమాపణ చెప్పి జిల్లాలో పర్యటించాలన్నారు. ప్రజల పక్షాన పోరాడితే స్వాగతిస్తామని మభ్యపెడితే చూస్తూ ఊరుకోమని మండిపడ్డారు. కాంగ్రెస్ జిల్లా కాంగ్రెస్ నాయకులు భూపతి, కొత్త రవీందర్, మైనార్టీ అధ్యక్షుడు ఇక్బాల్, ఫిషర్మెన్ కమిటీ అధ్యక్షుడు మహేందర్, మండల నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ మానేరు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న గుండవేని నారాయణ, బురుజుకింది ప్రవీణ్‌గౌడ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ముస్తాబాద్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం దేవరాజు



ఎల్లారెడ్డిపేటలో..

ముస్తాబాద్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం దేవరాజు అన్నారు. మండలంలోని నామాపూర్‌లో గురువారం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏపీఎం మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. సీసీలు శోభన్, సరోజన, ఐకేపీ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఏపీఎం మల్లేశం అన్నారు. ఆగ్రహారం, వెంకటాపూర్, ఎల్లారెడ్డిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు అందుబాటులో ఏర్పాటు చేస్తున్న కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు రైతులు సహకరించాలని కోరారు. సీసీలు నాగరాజు, రమణ, సుదర్శన్, వీవోఏలు సరిత, రేణుక, శోభ, బుక్ కీపర్లు, గ్రామసంఘాల అధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని గోపాల్‌రావుపల్లెలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఐకేపీ ఏపీఎం బత్తిని సుధాకర్, ఏపీవో పాపారావు, జేఈ రాజనర్సు, పంచాయతీ కార్యదర్శి సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ ఆలయం ప్రథమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరీకి అభిషేకం, హోమం, కుంకుమ పూజలు చేశారు. కుంకుమపూజలో 70 మంది మహిళలు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు గుండా మల్లేశ్, గంప నాగేంద్రం, గంప అంజయ్య, బొమ్మకంటి రాజేశం, టి.సుధాకర్, చకిలం మధు, బొమ్మకంటి అశోక్, చింతల రాజు, బొమ్మకంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, హెల్త్ అసిస్టెంట్ కిరణ్

వేములవాడ: రంజాన్ పండుగ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ గురువారం పరిశీలించారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద మైదానాన్ని శుభ్రం చేశారు. నమాజ్ చేసే ప్రాంతాలను, ఖబ్రస్థాన్‌లను శుభ్రం చేయించారు. ఈద్గా వద్ద నీరు, విద్యుత్ సౌకర్యం, సౌండ్ సిస్టమ్, శామియానాలు వేయించాలని మసీద్ అధ్యక్షుడు షేక్ ఇమామ్, ముస్లిం మత పెద్దలు షేక్ రియాజ్, సయ్యద్ అన్సార్, షేక్ ఇంతియాజ్, షేక్ వాజిద్, ఇర్ఫాన్‌లు కోరారు. హెల్త్‌అసిస్టెంట్ కిరణ్ ఉన్నారు

ఫోర్జరీపై తేలని నిజాలు

చందుర్తి: నకిలీ ధ్రువపత్రాలతో తమ సంతకాన్ని ఫోర్జరీ చేశారని మండలంలోని జోగాపూర్‌కు చెందిన పంచాయతీ కార్యదర్శి ఎర్రం కవిత పోలీసుల దృష్టికి తీసుకువెళ్లి పదిరోజులు గడిచినా అసలు నిందితులెవరన్నది తేల్చడంలో పోలీసులు విఫలమయ్యారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఫోన్ చేసిన వ్యక్తి విచారిస్తేనే..

జోగాపూర్‌కు చెందిన బుర్ర వెంకటేశం గ్రామంలోని బుర్ర రామవ్వ అనే మహిళ పేరున ఉన్న ఇంటిని బుర్ర వెంకటేశం పేరున దస్తావేజు నంబర్ ప్రకారం బుర్ర వెంకటేశం పేరిట ధ్రువీకరణ పత్రాన్ని తయారు చేయించారు. కానీ పోలీసుల విచారణలో ఆ విషయమే తనకు తెలియదని తప్పించుకునే యత్నిస్తున్నట్లు ప్రచారం. నకిలీ ధ్రువీకరణపత్రాలు ఇచ్చింది వెంకటేశం, ఇతరులెవరైనా తయారు చేయించి ఇచ్చారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని వివా దాస్పద గ్రామంగా రికార్డులకెక్కిన గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల ప్రమేయం ఉందని ప్రచారం.

అధికారులకు తప్పుడు సమాచారం..

మండల పోలీస్‌స్టేషన్‌లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కొందరు కానిస్టేబుళ్లను గ్రామాల్లో సమాచారం కోసం పోలీస్ అధికారులు వారిపైనే ఆధారపడడంతో తప్పుడు సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఆశిరెడ్డిపల్లె బాధిత మహిళకు న్యాయం చేయడంలో జాప్యం చేయడాన్ని కానిస్టేబుల్‌కు చార్జ్‌మెమో జారీచేశారు. ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లను బదిలీ చేస్తే న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాలున్నాయి.

జగ్జీవన్ రామ్‌కు నివాళి



సిరిసిల్లటౌన్: టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్లలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ.. జగ్జీవన్ రామ్ జీవితం అన్నితరాలకు, వర్గాలకు ఆదర్శమని వారు పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు. ఇక్కడ నాయకులు పోతుగంటి రమేశ్, లక్ష్మీరాజం, విష్ణు, పద్మారెడ్డి, శైలజ, శ్రీలత, భ్రమరాంబిక, వైష్ణవి, సుప్రియ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

7న ప్రవేశపరీక్ష

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశపరీక్ష ఈనెల 7 జరుగుతుందని జిల్లా విద్యాధికారి రమేశ్ గురువారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పరీక్ష ఉంటుందని, జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 7 నుంచి తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు పరీక్షకు జరుగుతుందన్నారు.

వణ్యప్రాణులను రక్షించాలి



వీర్నపల్లి: మండలంలోని గర్జన్‌పల్లి సెక్షన్ అడవి ప్రాంతంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ట్యాంకర్ సాయంతో అడవిలో ఉన్న నీటి తొట్టన్నీ నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వణ్యప్రాణులను రక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. వన్యప్రాణులను వేటాడినా, వధించినా, కేసులు నమోదు చేస్తామన్నారు. బీట్ ఆఫీసర్ సతీశ్, సిబ్బంది. జింక అనూక్, అరుణ్, రాములు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com